క్లుప్తంగా

31న వాహనాల వేలం

పాయకరావుపేట : ఈ నెల 31న మూడు వాహనాలను వేలం వేయనున్నట్లు ఎస్ఈబీ సీఐ పి.టి.వి.కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సారా, మద్యం అక్రమ తరలింపు కేసుల్లో పట్టుబడి, స్వాధీనం చేసుకున్న మూడు బైక్‌లను ఎస్ఈబీ స్టేషన్‌లో వేలం నిర్వహిస్తామన్నారు. ముందుగా ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాల్సిందిగా కోరారు.

గడ్డి ట్రాక్టరు దగ్ధం



గడ్డి ట్రాక్టరుపై మంటల్ని ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పాయకరావుపేట : మండలంలోని నామవరం గ్రామానికి చెందిన కె.శివ గడ్డి ట్రాక్టరు దగ్ధం అయినట్లు తుని అగ్నిమాపక దళ అధికారి డి.రామకృష్ణరాజు మంగళవారం తెలిపారు. జాతీయ రహదారిపై ప్రయాణిస్తూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ట్రాక్టరులో వున్న గడ్డి పూర్తిగా దగ్ధం అయిందన్నారు. సుమారు రూ.30 వేల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

అబాకస్ పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



అబాకస్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో స్కూల్ సిబ్బంది

పాయకరావుపేట: అబాకస్ జోనల్ పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పి.మాణిక్యాలరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడ శ్రీచైతన్య స్కూల్లో నిర్వహించిన జోనల్ స్థాయి పోటీల్లో సీనియర్ లెవెల్లో ఎ.ఎల్.ప్రదీప్ రెడ్డి, పి.భానుప్రకాష్‌లు నూరు శాతం మార్కులు సాధించి ప్రథమ బహుమతి, ఎ.జాహ్నవి ప్రోత్సాహక బహుమతి పొందినట్లు వెల్లడించారు. విజేతలకు నన్నయ్య యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎం.రాధమాధవి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించినట్లు తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ



టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందిస్తున్న మళ్ల బాపునాయుడు

మునగపాక : ప్రణాళికాయుత ప్రిపరేషన్‌తో పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని నాగులాపల్లి జెడ్పీ హైస్కూల్ పీఎంసీ చైర్మన్ మళ్ల బాపునాయుడు అన్నారు. స్థానిక జేపీ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు మంగళవారం పరీక్షా సామాగ్రిని అందించారు. కార్యక్రమంలో జేపీ స్టడీ సెంటర్ అధినేత దొడ్డి పరమేశ్వరరావు, ఉపాధ్యాయులు జగదీశ్వరి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

స్వచ్ఛ సంకల్పంతో గ్రామాలు సస్యశ్యామలం

మునగపాక : జగనన్న స్వచ్ఛ సంకల్పం ద్వారా గ్రామాలు సస్యశ్యామలంగా మారుతున్నాయని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. స్థానిక సంపద తయారీ కేంద్రంలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమం మంగళవారం నాటికి 4వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతోందన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఈశ్వరరావు, కాకరాపల్లి సర్పంచ్ మునిసినాయుడు, ట్రైనర్ అర్జున్ పాల్గొన్నారు.

వీరరమ్యకు అభినందన

మునగపాక : విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని సాధన సంస్థ కార్యదర్శి షేక్ ఇస్మాయిల్ అన్నారు. మండలంలోని తోటాడ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పాలమరశెట్టి వీరరమ్య ఇటీవల విడుదలైన ఎన్ఎంఎంఎస్ ఫలితాల్లో జిల్లా స్థాయిలో ద్వితీయ ర్యాంక్ సాధించింది. దీంతో హైస్కూల్‌లో వీరరమ్యకు శాలువా కప్పి అభినందించారు. స్కూల్ హెచ్ఎం కుమార్, పీఎంసీ చైర్మన్ భాస్కరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాతో ఆర్థిక భరోసా

- వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే సీఎంగా గెలిపిద్దాం
- మూడో విడత ఆసరా నిధుల పంపిణీలో ఎమ్మెల్యే కన్నబాబురాజు



మునగపాక వైఎస్సార్ ఆసరా సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు



రాంబిల్లిలో మహిళలకు వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక/రాంబిల్లి : వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎమ్మెల్యే యూవీ రమణమూర్తి(కన్నబాబు)రాజు లబ్ధిదారులకు సూచించారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత నిధుల పంపిణీలో భాగంగా మంగళవారం మునగపాక, రాంబిల్లిలో జరిగిన వేర్వేరు సభల్లో లబ్ధిదారులైన మహిళలకు నమూనా చెక్కును అందించారు. ముందుగా దివంగత మహానేత వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి, డ్వాక్రా మహిళలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని తూచా తప్పక నెరవేర్చిన ఘనత ఆయనదేనని కొనియాడారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్టు తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు పస లేని ఆరోపణలు, విమర్శలు చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగన్‌ను సీఎంగా గెలిపించి, సంక్షేమ, అభివృద్ధి పాలనను కొనసాగించుకోవాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతో రాష్ట్రంలో అవినీతి రహిత పాలన సాగుతోందన్నారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పెత్తనం ద్వారా అర్హులకు పథకాలు అందేవి కాదన్నారు. తమ ప్రభుత్వంలో వలంటీర్, సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చాక అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో సువర్ణ పాలన సాగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డి సీఎం కావాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జి.శిరీష్‌శ్రీనుబాబు, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, ధూళి నాగరాజు, వైస్ ఎంపీపీలు బోజా లక్ష్మీ శ్రీనివాసరావు, చిందాడ దేవి, కొటాపు లక్ష్మి, కశిరెడ్డి నరసింగరావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, దళిత విభాగం మండల అధ్యక్షులు మందా రాము, మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, సచివాలయాల మండల కన్వీనర్లు పొలిమేర గణేష్, కొవిరి రామకృష్ణ, ఎంపీడీవోలు రవికుమార్, కె.ఎస్.కొండలరావు, తహసీల్దార్ పి.భాగ్యవతి, వెలుగు ఏపీఎం కొండమ్మతో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.



అచ్యుతాపుంలో ఆసరా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అక్కచెల్లెమ్మల కళ్లల్లో ఆనందం చూడటమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలిస్తున్నారని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు అన్నారు. వైఎస్సార్ ఆసరా మూడవ విడత చెక్కును లబ్ధిదారులకు అచ్యుతాపురం పోలీస్ గ్రౌండ్‌లో జరిగిన బహిరంగ సభలో మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఇచ్చిన మాటను నిలబెట్టుకునే సీఎం జగన్‌ను చూసి గర్వపడుతున్నామన్నారు. అచ్యుతాపురం మండలంలో 14,463 మందికి రూ.11.31 కోట్ల మేర మూడో విడతలో లబ్ధి చేకూరిందన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎంపీపీ కోన సంధ్య, లచ్చన్నాయుడు, జెడీటీసీ లాలం రాంబాబు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, మాజీ అధ్యక్షుడు ఎం సూర్యనారాయణ, పార్టీ అధికార ప్రతినిధి పిన్నమరాజు వాసు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

జగనన్నా.. నీ వెంటే మేమంతా



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు

నక్కపల్లి : ఇచ్చిన మాట మేరకు వైఎస్సార్ ఆసరా పేరిట డ్వాక్రా రుణాల్ని చెల్లిస్తున్న సీఎం జగన్ వెంటే తామంతా నిలుస్తామని డ్వాక్రా మహిళలు స్పష్టం చేశారు. మూడో విడత నిధుల పంపిణీపై ఆనందం వ్యక్తం చేస్తూ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన మంగళవారం ఆసరా వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా సీఎం జగన్ చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. రత్నంతోపాటు, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, కాపు కార్పొరేషన్ చైర్మన్ వీసం రామకృష్ణ మాట్లాడుతూ మండలంలో 1,611 సంఘాల్లో 15,942 మంది సభ్యులకు మూడు విడతల్లో రూ.31.38 కోట్లు జమ చేసినట్టు వెల్లడించారు. గతంలో చంద్రబాబు మాదిరిగా ఎన్నికల స్టంట్‌గా ఈ కార్యక్రమాన్ని చేపట్టలేదన్నారు. నవరత్నాల్లో భాగంగా మహిళల కోసం వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, అమ్మఒడి, కాపునేస్తం, ఇళ్లస్థలాలు, ఇళ్లు అన్ని పథకాలు మహిళల పేరునే మంజూరు చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, మాజీ డీసీఎంఎస్ ఉపాధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, సర్పంచ్‌లు నేతల రత్నకుమారి, తళ్ల భార్గవ్, సాదిరెడ్డి శ్రీను, శంకర్రావు ఎంపీటీసీలు గొర్ల గోవిందు, ఎంపీడీవో సీతారామరాజు, ఐకేపీ సిబ్బంది, సీనియర్ నాయకులు యలమంచిలి తాతారావు, రోకళ్ల శ్రీను, కాకర వెంకటరావు, కుంచా సురేష్ పాల్గొన్నారు.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లకు సన్నాహాలు

డిజిటల్ అసిస్టెంట్లకు సబ్‌రిజిస్ట్రార్ సిబ్బందితో శిక్షణ



సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది

నక్కపల్లి : సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. దీని కోసం సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. మండలంలో రాజయ్యపేట, సీహెచ్‌బీ అగ్రహారం, గొడిచర్ల, జగన్నాథపురం సచివాలయాల్లో తొలివిడతగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించనున్నారు. దీని కోసం ఆయా సచివాలయాల సిబ్బందికి మంగళవారం నక్కపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ బేగం ఆధ్వర్యంలో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ప్రారంభించారు. దస్తావేజులు ఏ విధంగా తయారు చేయాలి, చలానాలు చెల్లించడం, మార్కెట్ విలువ, చుక్కల భూముల గుర్తింపు, కక్షిదారులకు సంబంధించిన వివరాలు స్కానింగ్, నమోదు, వివాదాస్పద భూముల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దస్తావేజు తయారీ, నకళ్లు, ఈసీల జారీ, జీపీఏలు, తనఖా రిజిస్ట్రేషన్లు, రిజిస్ట్రేషన్ చేసే సమయంలో పాటించాల్సిన నిబంధనలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. త్వరలోనే మండలంలోని సదరు గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు పారంభించనున్నట్టు అధికారులు చెప్తున్నారు.

పాయకరావుపేట నియోజకవర్గానికి సంబంధించి నక్కపల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాల్లో రిజిస్ట్రేషన్ సేవలన్నీ నక్కపల్లిలోనే జరుగుతుంటాయి. ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన విధానం అమల్లోకి వస్తే ఈ మూడు మండలాల కక్షిదారులు నక్కపల్లి రానక్కర్లేదు. స్థానికంగా ఉండే సచివాలయాల్లోనే తమ భూముల క్రయవిక్రయాలు పూర్తి చేసుకునే వెసులుబాటు కలుగనుంది.

భూగర్భ జలాల సంరక్షణకు కృషి



మాట్లాడుతున్న నీటిపారుదల శాఖ డీఈఈ రాజేంద్రకుమార్

మునగపాక : భూగర్భ జలాలు కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందని నీటిపారుదల శాఖ డీఈఈ రాజేంద్రకుమార్ అన్నారు. మండలంలోని తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సాధన సంస్థ ఆధ్వర్యంలో భూగర్భ జలాల ప్రస్తుత పరిస్థితి, సుస్థిర అభివృద్ధి, పర్యవేక్షణ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వినియోగంలో ప్రతి ఒక్కరూ పొదుపు పాటించాలన్నారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి జల సంరక్షణకు కృషి చేయాలన్నారు. సాధన సంస్థ కార్యదర్శి షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ భావి తరాలకు నీటిని అందించేందుకు విద్యార్థి దశనుంచే అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. జిల్లా భూగర్భజల శాఖాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ శుద్ధి చేసిన నీటిని మాత్రమే తాగాలన్నారు. కార్యక్రమంలో హైడ్రాలజిస్టు నారాయణమూర్తి, ఏపీవో గోవిందరావు, హెచ్ఎం కుమార్, పీఎంసీ చైర్మన్ భాస్కరరావు, సాధన సిబ్బంది పాల్గొన్నారు.

'సంపద తయారీ కేంద్రాలతో అదనపు ఆదాయం'



భీమవరంలో తడి పొడి చెత్త నిర్వహణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

ఎస్.రాయవరం : గ్రామాల్లో తడి, పొడి చెత్తల నుంచి ఎరువు తయారీచేసే సంపద కేంద్రాలతో పారిశుధ్య మెరుగుతోపాటు, పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని అనకాపల్లి డీపీవో శిరీషారాణి అన్నారు. భీమవరం, పెనుగొల్లు గ్రామాల్లో మంగళవారం ఆమె పర్యటించారు. భీమవరం ఘన వ్యర్థ నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలో నివాసాలను నుంచి సేకరించిన చెత్తను ఎప్పటికప్పుడు ప్రాసెస్‌చేసి, వానపాములు, పశువుల వ్యర్థాలను ఉపయోగించి ఎరువుగా మార్చాలన్నారు. అనంతరం పెనుగొల్లు గ్రామంలో పారిశుధ్య సమస్యను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో ఆమె వెంట ఈవోపీఆర్డీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు ప్రసాద్, రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు గరగా శ్రీనివాసరావు, ఉద్దండం సూర్యనారాయణ తదితరులున్నారు.

'ఆ నలుగుర్ని బర్తరఫ్ చేయాలి'



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీపీ రత్నం, జెడ్పీటీసీ కాసులమ్మ తదితరులు

నక్కపల్లి : జగనన్న దయతో వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచి, ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి అమ్ముడు పోయిన నలుగురు ఎమ్మెల్యేలను తక్షణమే పదవుల నుంచి బర్తరఫ్ చేయాలని నక్కపల్లి ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మలు డిమాండ్ చేశారు. మంగళవారం వారు నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ పార్టీలో ఉంటూ వెన్నుపోటు పొడిచే వారిని ఉపేక్షించరాదదన్నారు. దళిత జాతి సిగ్గుపడేలా ఉండవల్లి శ్రీదేవి టీడీపీతో కుమ్మక్కయిందని ఆక్షేపించారు. కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ మాట్లాడుతూ వెన్నుపోటు రాజకీయాలు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. గతంలో 23 మంది ఎమ్మెల్యేలను సంతలో పశువులను కొన్నట్లు కొన్నాడని, ఇప్పుడు నలుగురిని కొని ఎమ్మెల్సీ దక్కించుకున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, వైస్ ఎంపీపీలు ఈశ్వరరావు, సర్పంచ్‌లు శంకర్రావు, భార్గవ్, సాదిరెడ్డి శ్రీను, దళిత నాయకులు కాకర వెంకటరావు, కుంచా సురేష్, యజ్జల అప్పలరాజు పాల్గొన్నారు.

'ఆధార్ అప్‌డేట్ చేసుకోండి'

పాయకరావుపేట : గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాల ద్వారా మార్పులు, చేర్పులు చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ సూచించారు. బీకే పల్లిలో ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని మంగళవారం పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రుణాల వన్‌టైం సెటిల్‌మెంట్‌కు వినతి

యలమంచిలి : కొక్కిరాపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుందని, దీని దృష్ట్యా రుణాలు తీసుకున్న రైతులుకు వడ్డీ రాయితీతో కూడిన వన్‌టైం సెటిల్‌మెంట్‌కు అనుమతించాలని సంఘం అధ్యక్షుడు మళ్ల కొండబాబు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) చైర్‌పర్సన్ చింతకాయల అనితను కోరారు. ఈ మేరకు సంఘం ఆర్థిక వివరాలతో కూడిన వినతి పత్రాన్ని మంగళవారం ఆమెకు అందజేశారు. కొక్కిరాపల్లి పీఏసీఎస్‌కు వివిధ రుణాల ద్వారా అసలు వడ్డీ కలిపి రూ.7 కోట్ల 24 లక్షల 85 వేల 357 వసూలు కావాల్సివుంది. సంఘం డీసీసీబీకి రూ.9 కోట్ల 81 లక్షల 18 వేల 253 రూపాయల రుణం చెల్లించాల్సి ఉంది. గత టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన రైతు రుణ మాఫీ పథకం తమ సహకార సంఘానికి వర్తించలేదని, రైతులు అధిక వడ్డీలు చెల్లించేందుకు ఆసక్తి చూపట్లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో వడ్డీ రాయితీతో కూడిన వన్‌టైం సెటిల్‌మెంట్‌కు అనుమతిస్తే రైతులు రుణాలు చెల్లించేందుకు ముందుకు వస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

శ్రీరామనవమికి ఆలయాల ముస్తాబు

- అరబుపాలెం రాములోరి పెళ్లికి ఏర్పాట్లు
- భద్రాద్రి సీతారాముల కల్యాణాన్ని తలపించేలా నిర్వహణ



అరబుపాలెంలో సీతారాముల వారి ఆలయం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



సీతారాముల సన్నిధిలో పూజలు

మునగపాక : మండల వ్యాప్తంగా శ్రీ రామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 30న జరగనున్న వేడుకలకు సంబంధించి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఇప్పటికే పలు గ్రామాల్లో కల్యాణ వేడుకకు అవసరమయ్యే పందిళ్లు ఏర్పాటు చేసి, రంగులతో అలంకరిస్తున్నారు.

అరబుపాలెం సీతారామాలయంలో ఏటా భద్రాద్రి మాదిరే కల్యాణ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు ఆలయ ధర్మకర్త బొడ్డేడ వెంకటసతీష్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. 30న ఉదయం 9.30 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. అనంతరం భారీ అన్నసమారాధన ఉంటుంది. ముందస్తు వేడుకల్లో భాగంగా 29న ఆలయంలో ధ్వజారోహణ జరగనుంది. ఏప్రిల్ 1న స్వామివారి రథోత్సవం, 5న దొంగవిల్లి, 6న నాగవల్లి వసంతోత్సవం, 7న పుష్పాంజలి శ్రీ పుష్పయాగం తదితర కార్యక్రమాలతో 9 రోజులపాటు వేడుకల నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కల్యాణ వేడుకల్ని చూసేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు.

మునగపాకలోని సంతబయిల రామాలయం, పంచాయతీ వీధిలోని రామాలయం, గౌరీ పరమేశ్వరుల ఆలయ ప్రాంగణంలోని రామాలయం, కాకరాపల్లి, వాడ్రాపల్లి, నాగవరం, గవర్ల అనకాపల్లి , ఉమ్మలాడ, నాగులాపల్లి తదితర గ్రామాల్లోని రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలను భక్తి శ్రద్ధలతో జరిపేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మునగపాక : నాగులాపల్లిలో జరగనున్న శ్రీరామనవమి వేడుకల పోస్టర్‌ను ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు మంగళవారం ఆవిష్కరించారు. నవమి వేడుకలను గ్రామస్తులంతా ఒక్కటై ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, అనకాపల్లి జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ సింగర్‌రాజు, ఎంపీటీసీ మళ్ల కాశీ సురేష్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు బొడ్డేడ బుజ్జి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలంలోని దిమిలి గ్రామంలో సీతారాముల కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉదయం, సాయంత్రం పురోహితులు కె.రామకృష్ణ, కె.టి.దీక్షితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తున్నారు. 30న సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

గ్రంథాలయం తనిఖీ



పాఠశాల గ్రంథాలయంలో ఎస్ఎస్ఏ అధికారులు

నక్కపల్లి : స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని సర్వశిక్ష అభియాన్ రాష్ట్ర అధికారులు సుజని, అభిజిత్‌లు మంగళవారం తనిఖీ చేసారు. స్టాక్, పుస్తక పరామర్శ రిజిస్టర్లను పరిశీలించి, రోజూ ఎంతమంది విద్యార్థులు గ్రంథాలయాన్ని వినియోగిస్తున్నారనే విషయాలు తెలుసుకున్నారు. గ్రంథాలయ నిర్వాహణ, ఇంగ్లిష్ పుస్తకాలను సైతం విద్యార్థులు చదువుతుండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్ఎం రాణిలలిత, తెలుగు ఉపాధ్యాయుడు గ్రంథాలయ నిర్వాహకుడు ఎన్వీఎస్ ఆచార్యులను అభినందించారు. ఈ తనిఖీల్లో ఉపాధ్యాయుడు టీవీ రమణ పాల్గొన్నారు.

'ఓటీఎస్‌ను వినియోగించుకోండి'



లబ్ధిదారులకు ఓటీఎస్ పత్రాలు అందిస్తున్న ఉమ్మలాడ సర్పంచ్ గంగయమ్మ

మునగపాక : ఓటీఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మలాడ సర్పంచ్ సూరిశెట్టి గంగయమ్మ(ఎస్ఆర్) పిలుపునిచ్చారు. మంగళవారం ఉమ్మలాడలో అర్హులైన లబ్ధిదారులకు ఓటీఎస్ ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఓటీఎస్ ద్వారా ఎలాంటి పత్రాల్లేని వారికి ఎంతగానో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మందా రాము, వైఎస్సార్‌సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ

ఎస్.రాయవరం : త్రైత సిద్ధాంత తెలుగు సంవత్సర క్యాలెండర్‌ను మండల తహసీల్దార్ శ్యామ్ కుమార్ మంగళవారం ఆవిష్కరించారు.

పాఠశాలకు వంటపాత్రల పంపిణీ



వంటపాత్రలు పంపిణీ చేస్తున్న హెటెరో ప్రతినిధులు

నక్కపల్లి : స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకానికి హెటెరో యాజమాన్యం రూ.లక్ష విలువైన వంటపాత్రలను విరాళంగా అందించింది. మంగళవారం కంపెనీ డీజీఎంలు సుబ్బారెడ్డి, కుళ్లాయి రెడ్డిలు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు వంటపాత్రలు, గ్రైండర్లు, స్టౌవ్ తదితర సామగ్రిని అప్పగించారు. పాఠశాల సిబ్బంది, పేరెంట్స్ కమిటీ అభ్యర్థన మేరకు కంపెనీ సీఎండీ బండి పార్థసారథిరెడ్డి ఆదేశాలతో ఈ వంట పాత్రలు అందించినట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు.కార్యక్రమంలో హెచ్ఎం పుష్పరాగం, ఎస్ఎంసీ చైర్మన్ అమలకంటిదేవి, సంస్థ ప్రతినిధి శ్రీనివాస్ పాల్గొన్నారు.